క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్ శంకర్

పహాడీషరీఫ్: కాలనీని శుభ్రంగా ఉంచడంలో కార్మికులు పడే శ్రమ వెలకట్టలేనిదని 19వ వార్డు మాజీ కౌన్సిలర్ పల్లపు శంకర్ అన్నారు. గురువారం జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీలో ఆయన పారిశుద్ధ్య విభాగం సూపర్‌వైజర్ కుమార్‌తో పాటు కార్మికులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీని శుభ్రంగా ఉంచడంలో కార్మికులు పడే శ్రమ వెలకట్టలేనిదని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కార్మికులకు వేతనాలు పెంచి, సకాలంలో అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కృష్ణ, భీమ్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ వాణి

తుక్కుగూడ: ఆస్తిపన్ను చెల్లింపుదారులకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుపై ప్రభుత్వం 5శాతం రాయితీ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి తెలిపారు. ఈ రాయితీ ఈ నెల 30 వరకు మాత్రమే వర్తిస్తుందన్నారు. మున్సిపల్ ప్రజలు ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి రాయితీ పొందాలని కోరారు.

మేడేను విజయవంతం చేయండి



మేడే వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మీర్‌పేట: మే 1వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ బాలాపూర్ మండల అధ్యక్షుడు దాసరి బాబు పిలుపునిచ్చారు. గురువారం మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం వద్ద మేడే వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, ఇతర సదుపాయాల అమలుకు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరిచారి, ధనుంజయ్, మున్సిపల్ సూపర్‌వైజర్లు బాలకృష్ణ, రాజిరెడ్డి, ప్రభాకర్, నర్సింహా, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రోత్సాహకం అందజేత



విద్యార్థిని సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లికి చెందిన పోలా తేజస్విని ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో 954 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. దీంతో ఆ విద్యార్థినితో పాటు ఆమె తల్లిదండ్రులను గురువారం గ్రామ మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ గ్రామ నాయకులతో కలిసి సన్మానించి రూ.10వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఉన్నత చదువులతో గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కొంతం అంజిరెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొంతం లింగారెడ్డి, కప్పాటి అంజిరెడ్డి, నగేశ్‌గౌడ్, మోడల్ స్కూల్ టీచర్ హరీశ్‌గౌడ్, పెంటయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొత్తూరు: ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో గురువారం స్థానిక బీజేపీ నాయకుడు హరికృష్ణచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాధ్యమైనంత వరకు ప్రజలు ఎండలో బయటకు రావొద్దన్నారు. తప్పనిసరిగా రావాల్సిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్‌చారి, కొండల్‌చారి, జనార్థన్‌చారి, భైరమోని నర్సింహా, ఇంద్రసేనారెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రతిబంధకంగా మార్గదర్శకాలు!

- ఇబ్బందుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు
- 400నుంచి 600 అడుగుల విస్తీర్ణానికి తప్పని తిప్పలు
- అంతకంటే ఎక్కువ ఉంటే మంజూరు కాని నిధులు
- పట్టించుకోని అధికారులు



సరస్వతిగూడలో ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సరిత తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని 35 గ్రామ పంచాయతీల్లో 14,864 మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా మండలానికి తొలుత మొత్తం 1,150 ఇళ్లు మంజూరు కాగా ఆ సంఖ్యకు మరో 20 శాతం పెంచుకునే అవకాశం ఇవ్వడంతో 1,376 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో ఎంత మంది అర్హులో గుర్తించే పనిలో అధికారులు బిజీగా ఉన్నారు. కాగా గ్రామాల్లో ఇంటి స్థలం ఉండి అన్ని అర్హతలు ఉన్నవారికి ప్రభుత్వం రూ.5 లక్షలు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మాణాన్ని బట్టి విడతల వారీగా ఇవ్వనుంది. మరోపక్క ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు లబ్ధిదారులకు ప్రతిబంధకాలుగా మారాయి. లబ్ధిదారులకు ఎంత విస్తీర్ణం స్థలం ఉన్నా, కేవలం 400 నుంచి 600 అడుగులలోపే నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇలాంటి నిబంధనలు ప్రస్తుతం సమస్యగా మారాయి. అంత తక్కువ విస్తీర్ణంలో నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ఆలోచనలో పడుతున్నారు. అంత కంటే ఎక్కువ నిర్మాణం చేపడితే ఆన్‌లైన్లో ఏఐ లింక్ ద్వారా ఫొటో తీసి అప్‌లోడ్ చేయడానికి వీలుకాదు. దీంతో వాస్తవ పరిస్థితులకు వచ్చే సరికి ఇటు లబ్ధిదారులకు అటు అధికారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం సమస్యగా మారింది. అందుకు ఉదాహరణగా మొదటి విడతలో సరస్వతిగూడలో 19 మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తే నిబంధనల కారణంగా కేవలం 7గురు మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభించారు. అందులో నాలుగు ఇళ్లను బేస్‌మెంట్ లెవల్ చేపట్టారు. మిగతా వారు ఇంత వరకు ప్రారంభించలేదు. లబ్ధిదారులు మాత్రం తమకు ఇల్లు మంజూరైతే తమ ఇష్టానుసారంగా ఇల్లు నిర్మించుకునేలా నిబంధనలు సవరించాలని కోరుతున్నారు.



బేగంపేటలో లబ్ధిదారుల ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

4,837 మంది అర్హులు



మండలంలో మొత్తం 14,864 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అందులో 4,837 మందిని అర్హులుగా గుర్తించాం. ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో మరోమారు సర్వే కొనసాగుతుంది. లబ్ధిదారులు కేవలం 400 నుంచి 600 అడుగుల విస్తీర్ణంలోనే ఇల్లు నిర్మించుకోవాల్సి ఉంది. అంత కంటే ఎక్కువ విస్తీర్ణం ఉంటే ఏఐ లింక్ ద్వారా తీసుకునే ఫొటో అప్‌లోడ్ కావడం లేదు. దీంతో మొదటి విడతలో సరస్వతిగూడలో మంజూరైన 19 ఇళ్లలో 7గురు మాత్రమే ప్రారంభించారు. అందులో ముగ్గురికి రూ.లక్ష చొప్పున నిధులు సైతం మంజూరయ్యాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకుంటేనే నిధులు మంజూరవుతున్నాయి.

– సరిత, ఎంపీడీఓ, కందుకూరు

రోహింగ్యాల అక్రమ వలసలను అరికట్టాలి

బాలాపూర్ తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి



తహసీల్దార్ ఇందిరాదేవికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో తలదాచుకున్న రోహింగ్యాలను ఏరిపారేసే చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవికి వినతి పత్రం సమర్పించారు. పార్టీ కార్పొరేషన్ సెక్టార్–1, 2 అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలాపూర్ ప్రాంతంలో రోహింగ్యాలు స్థిరపడిన ప్రాంతాల్లో మతపరమైన శిబిరాలు, మదర్సాలను అడ్డుపెట్టుకొని హిందువులను శంఖించదగిన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇది కేవలం అక్రమ వలస సమస్య కాదు దేశ, ప్రజల భద్రతకు ఉన్న ప్రత్యక్ష ముప్పు అని ఆరోపించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో రోహింగ్యాలు అక్రమ వలసదారులుగా ఉంటూ జాతి భద్రతకు సవాల్ విసురుతున్నారన్నారు. ఇప్పుడు బోగస్ ఆధార్, ఓటర్ కార్డులు సిద్ధం చేసుకొని నిబంధలను అతిక్రమిస్తూ భారతపౌరులుగా వేశాలు వేసుకుంటూ చలామణి అవుతున్నారని పేర్కొన్నారు. అక్రమ వలసదారుల వెనక పెద్ద మాఫియా ఉందని, రెవెన్యూ, పోలీస్ శాఖలు జోక్యం చేసుకొని సర్వే నిర్వహించి అక్రమంగా పుట్టిన డాక్యుమెంట్లను రద్దుచేయాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు ఏనుగు రాంరెడ్డి, రేసు నర్సింహారెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, రాజ్‌కుమార్, తిరుమలేశ్, మల్లెల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్: ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఆరుగురు గెజిటెడ్ అధికారులను నియమించారన్నారు. ఈ నెల 30 వరకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వానికి నివేదికను అందిస్తామని తెలిపారు. లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



అంతారంలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ స్రవంతి

షాబాద్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశువైద్యాధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, స్రవంతి సూచించారు. గురువారం మండల పరిధిలోని అంతారం, సంకెపల్లిగూడ, బోనగిరిపల్లి గ్రామాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో పశువులకు మే 13 వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు, పశుకాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బలరాం, అంజయ్య, మహేందర్, రాణి, శ్రీకాంత్, సాయి, శేఖర్ తదితరులు ఉన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీఓ విజయలక్ష్మి

ఎంపీఓ విజయలక్ష్మి

కొత్తూరు: గ్రామ పంచాయతీల పరిధిలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చే సమస్యలను పంచాయతీ కార్యదర్శులు సకాలంలో పరిష్కరించాలని ఎంపీఓ విజయలక్ష్మి సూచించారు. గురువారం ఆమె గూడూరులో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించినట్లు తెలిపారు. అంతేకాకుండా సభలో ప్రజలు వివిధ సమస్యలను తమ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆరోగ్యం, శుభ్రత, తదితర అంశాలపై వైద్య, సిబ్బంది, అధికారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగ తరగతులను ప్రారంభిస్తున్న సీఐ విజయ్‌కుమార్

సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్: ప్రతిరోజు యోగ సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పట్టణ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. పట్టణ సమీపంలోని సాయిబాలాజీ టౌన్‌షిప్ పార్కులో పతంజలి యోగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పానుగంటి శశిధర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత యోగ శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రతిరోజు యోగ సాధన చేయాలని సూచించారు. యోగాతో మానసికోల్లాసం కలగడంతో పాటు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. యోగాసనాలతో ఒత్తిడిని తగ్గించంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉదయం 5 గంటల నుంచి 6:30 గంటల వరకు నిర్వహించే ఈ ఉచిత యోగ శిక్షణ తరగతులను పరిసర కాలనీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యోగ గురువులు రాజేశ్వర్, జోత్స్న, కాలనీవాసులు రాఘవేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు

నందిగామ: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో 12 రోజులుగా నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విన్నర్ టీమ్‌కు రూ.30వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు. అదేవిధంగా రన్నర్‌గా నిలిచిన టీమ్‌కు రూ.20వేల నగదుతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కాట్న మాధవిరవీందర్, మాజీ ఉపసర్పంచ్‌లు సత్యనారాయణ, హన్మంత్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ యాదగిరిరెడ్డి, నాయకులు రఘుపతిరెడ్డి, వెంకటేశ్, దామోదర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, కృష్ణయ్య, పురోషోత్తంరెడ్డి, అశ్రఫ్, శ్రీనివాస్, శ్రీకాంత్, మధు, రాజు, జగన్, క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి పిరికిపంద చర్య

- ముష్కరుల దాడిని ఖండిస్తూ నిరసనలు
- ఉగ్రవాదుల దిష్టిబొమ్మల దహనం



మహేశ్వరంలో అమరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ముస్లింలు



కందుకూరులో ఉగ్రవాదుల దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు



మీర్‌పేట: మీర్‌పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మహేశ్వరం: జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని మండల ముస్లిం కమిటీ అధ్యక్షుడు ఎం ఏ.ఫరీద్ పేర్కొన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో పహల్గామ్‌లో పర్యాకులపై జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకురాలని కోరుతూ కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించి వారి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదులు పర్యాటకులపైన దాడికి పాల్పడడం పిరికి చర్య అన్నారు. భారత్.. పాకిస్థాన్‌కి తగిన బుద్ధి చెప్పాలన్నారు. అంతకుముందు అంబేడ్కర్ చౌరస్తా వరకు జాతీయ జెండాను చేతబట్టి ముస్లిం యువకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి అమరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేశ్వరం ముస్లిం కమిటీ సభ్యులు మహ్మద్ మోసిన్‌ఖాన్, సయ్యద్ అదిల్ అలీ, అలీ బావాజీర్, ముస్తాక్ ఖాద్రీ, సజ్జాద్ అన్వర్, ఎం.ఏ.సమీర్, సయ్యద్ షైబాజ్ పలువురు పాల్గొన్నారు.

మీర్‌పేట: దేశ భద్రతకు భంగం కలిగించే వారి పట్ల కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని మీర్‌పేట బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి కోరారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ గురువారం మీర్‌పేటలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేసి, మృతి చెందిన 26 మందికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన దోషులను వెంటనే పట్టుకొని శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అర్కల భూపాల్‌రెడ్డి, దిండు భూపేశ్‌గౌడ్, జటావత్ శ్రీనునాయక్, సిద్దాల బీరప్ప, సునీత బాల్‌రాజు, యాదగిరి ముదిరాజ్, విజయలక్ష్మి, రజాక్, మాదరి రమేశ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ

బీఆర్‌ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గులాబీ శ్రేణులు పెద్దఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కామేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

కందుకూరు: ఉగ్రదాడులను ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య, మాజీ ప్రజాప్రతినిధులు బక్క మల్లేశ్, గౌర ప్రభాకర్ హెచ్చరించారు. కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అమాయక యాత్రికులపై దాడి చేయడం దారుణమన్నారు. ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌ను ప్రపంచం మొత్తం వెలివేసే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఉగ్రవాదుల వెన్నులో వణుకు పుట్టేలా కేంద్ర ప్రభుత్వం తగిన రీతిన జవాబు ఇవ్వనుందన్నారు. అనంతరం ఉగ్రదాడుల్లో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ నివాళులర్పించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా నాయకులు కృష్ణకుమార్, రాంరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎస్.భూమిరెడ్డి, ఎస్.దయాకర్‌రెడ్డి, ఏ.యాదగిరి, నర్సింహా, కుమార్, మల్లేశ్, నవీన్, డి.అనిల్, ఆంజనేయులు, పాండు, ప్రవీణ్, బాల్‌రాజ్, రాజు, మహేశ్, నరేందర్, చంద్రయ్యచారి, శ్రీనివాస్, సాయి, అంజయ్య, శ్రీశైలం, సురేష్, మహేశ్, భానుప్రకాశ్, మహేందర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇళ్ల రీ'సర్వే'

- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల అర్హుల గుర్తింపు
- గ్రామాల్లో అధికారుల క్షేత్రపరిశీలన
- లబ్ధిదారుల ఎంపికకు పక్కా ప్రణాళిక
- మే 5 నుంచి అర్హుల ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



బోధునంపల్లిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై అధికారులు దృష్టి సారించారు. ప్రతీ మండలానికి ఒక్క గ్రామం చొప్పున పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించి ఇళ్లను మంజూరు చేశారు. పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మొదటి దఫా బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసిన ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో లక్ష రూపాయల బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ప్రజాపాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి ఇళ్లను అందించాలనే ఉద్దేశంతో మొదటి విడతగా గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు.

745 ఇళ్లు మంజూరు..

రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు మొదటి విడతలో 745 ఇళ్లు మంజూరు చేసింది. మండల పరిధిలోని అల్వాల (38), బైర్కాన్‌పల్లి (24), చింతకుంటపల్లి (27), బోధునంపల్లి (19), చింతకుంటపల్లి (27), దత్తాయపల్లి (06), దేవునిగుడితండా (25), ఎక్లాస్‌ఖాన్‌పేట (33), ఇప్పలపల్లి (15), కాకునూర్ (30), కేశంపేట (50), కొనాయపల్లి (20), కొత్తపేట (55), కొండారెడ్డిపల్లి (35), లేమామిడి (22), లింగంధన (23), మంగళిగూడ (30), నిర్దవెల్లి (41), పాపిరెడ్డిగూడ (36), పాటిగడ్డ (11), పాల్కొనిగుట్టతండా (12), పుట్టోనిగూడ (22), సంగెం (19), సంతాపూర్ (35), సుందరపూరం (12), తొమ్మిదిరేకుల (18), తూర్పుగడ్డతాండ(11), వేములనర్వ(50) ఇళ్లకు దరఖాస్తులు వచ్చాయి. వీటిలో నుంచి 745 మంది నిరుపేదలను గుర్తించి వారికి ఇళ్లను మంజూరు చేయనున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా పోమాల్‌పల్లిలో ఇప్పటికే 36మంది లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

గెజిటెడ్ అధికారులతో సర్వే

రాష్ట్ర ప్రభుత్వం అందించిన మొదటి విడత లిస్టును ఆధారంగా చేసుకొని జిల్లా అధికారులు మండలస్థాయి వెరిఫికేషన్‌కు గెజిటెడ్ అధికారులను నియమించింది. వీరు గ్రామాల్లో ఉన్న లిస్టు అధారంగా ఇంటింటికీ వెళ్లి ఇళ్లు ఎలా ఉంది.. కొత్తగా ఇంటి నిర్మాణానికి స్థలం ఉందా లేదా అనే వివరాలతో పాటుగా ఇళ్లు మంజూరు చేస్తే నిర్మించుకునేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారా అనే విషయాలను తెలుసుకుంటున్నారు. ఈ సర్వేను అధికారులు ఈ నెల 30లోగా పూర్తి చేయాల్సి ఉంది. మండలంలో 814 మందితో కూడిన మొదటి విడత లిస్టులో 714 మందికి ఇళ్లు మంజూరైనట్టు అధికారులు తెలిపారు.

రోజువారీ కార్యక్రమాలు

ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు గెజిటెడ్ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన. మే 1న ఎంపీడీఓ లాగిన్‌కు మెరిట్ లిస్ట్, మే 2న మెరిట్ లిస్టు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద బహిర్గతంగా ఉంచడం. మే 3, 4వ తేదీల్లో మెరిట్ లిస్టు ఆన్‌లైన్ పోర్టల్‌లో వెరిఫికేషన్.

మే 5 నుంచి నిర్మాణాలు

గెజిటెడ్ అధికారులు గ్రామాల్లో నిర్వహించిన సర్వేలో అర్హులను గుర్తించి నివేదికలను జిల్లా అధికారులకు అందిస్తారు. మే 1 నుంచి 4వ తేదీ వరకు వెరిఫికేషన్‌తో పాటు ఆన్‌లైన్ పూర్తయిన వెంటనే మే 5 నుంచి హౌసింగ్ అధికారులతో కలిసి గ్రామాల్లో ప్రభుత్వం సూచించిన కొలతల మేరకు ఇంటి నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు.